# నగర వ్యాప్తంగా 100 ఉచిత వైద్య శిబిరాలు

# ఎమ్మెల్సీ డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి

ఆర్థిక సమస్యలు, దూరాభారం వల్ల అనారోగ్యానికి గురయినా వైద్యం చేయించుకోలేని పరిస్థితులు ఎదుర్కొంటున్న వివిధ వర్గాల ప్రజలకు నాణ్యతతో కూడిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయాలని ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్ట్, ఎమ్‌పిఎమ్ ట్రస్టు నిర్ణయించాయని రాష్ట్ర శాసన మండలి సభ్యుడు, ఎమ్‌పిఎమ్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి పేర్కొన్నారు. స్థానిక 19వ వార్డు భానోజినగర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ట్రస్ట్ తరఫున నగరంలోని అన్ని వార్డులలో 100 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. గీతం దంత వైద్య కళాశాల –ఆసుపత్రి, గీతం జిమ్‌సర్ వైద్యాలయం సౌజన్యంతో జరిగే వైద్య శిబిరాలలో దంత వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు, సాధారణ వైద్య సేవలతో పాటు స్త్రీలు, గర్భిణీలు, చిన్న పిల్లలు సహితం ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా 20 మందిలో వైద్య బృందాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వైద్య శిబిరాలలో ఆరోగ్య పరీక్షల ద్వారా వైద్య తీవ్రతను బట్టి అవసరమైన వారికి ఆసుపత్రులలో స్వస్థత చేకూరే వరకు ఉచిత చికిత్స అందిస్తామని, నగర ప్రజలు ఈ శిబిరాలను ఉపయోగించుకోవాలని సూచించారు. జిమ్‌సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామప్రసాద్ ఆసుపత్రి వైద్య సేవలను వివరించారు. అవసరమైన వారికి జిమ్‌సరి వైద్య వాహనం ద్వారా ఆసుపత్రికి తీసుకెళ్ళి ఉచిత చికిత్సలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో దాదాపు 500 మంది స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారిలో అధికంగా మహిళలు, చిన్న పిల్లలు ఉన్నారు. ఎన్‌టిఆర్ సేవాసమితి ట్రస్టు ప్రతినిధులు ఆళ్ల శ్రీనివాసు, దేవారెడ్డి, పి.వి.రామరెడ్డి, వెంకినాయుడు, స్థానికసామాజిక కార్యకర్తలు భోగి భారతి, ఆశలేష, ఉష, కాళ్ల ఆనందు, డిల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**తేది: 20-3-2018,** — **వ్యక్తిగత కార్యదర్శి**

**విశాఖపట్నం.** — **డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి కార్యాలయం**